# గుణసంధి

అ-ను-బంధం...అని, బిగ్గరగా సణుక్కు౦టున్నట్లు గొణుగుతున్నాడు...నేస్తం.

ఆ ఊరివాడిని కాబట్టి, అభిమానం కొద్దీ... 'కృష్ణాపత్రిక సారస్వతానుబంధం' అని నేను కలగంటున్నట్టు అర్థం చేసుకున్నాను.

'కాదోయీ...ఋణానుబంధం...' ఇదీ వాడి సొద.

"ఎక్కడో-ఏకడనో, పల్లెల్లోపుట్టి - పెరిగిన బందరులో, పద్దు వ్రాసి కొనుక్కున్న ఉత్తరీయం, అలహాబాదులో ఆ చలిలో గజగజలాడే ముసలిబడుగు అవస్థకు గుండె కరగి...రైలు కదులుతూండగా అలా కిటికీలో౦చి గిరవాటు వేశాను... ఎక్కడికెక్కడో చూశావా...యింతకూ అది వాడికి ప్రాప్తం...

ఇత్యాదయః...

అవును-భాయీ-గా తల ఊగించుతూ, దానబ్బగా, నా కథ అల్లాను...

"దోవవెంట పోతూవుంటే...కానీ దొరికింది. కానీ దొరికితే, కలిసివస్తుందని నానుడి. కానీ చూద్దాం.. పార్కు మలుపులో కానీ-కానీ లాటరీ పరుచుకు కూర్చుంటే, బిల్లేరీ అద్దంమీద దాన్ని కాచాను; కాచి-కాచి, కలకాలం ఉసూరుమనేట్టు, అర్ధరూపాయి, వాడిదగ్గర దోచాను.

(చెప్పడం మరచిపోయినట్లున్నాను-యిందాకటినుంచీ ఇదంతా జరుగుతూన్నది... ఎక్కడోకాదు, మన బెజవాడలో.)

అప్పటికి రెండున్నర అయింది. మధ్యాహ్నం. ఆదివారం పగలుసినిమాకు ఆ కాస్త ఖర్చు పెట్టేస్తే...ఆ దోషం అంతటితో తీరిపోతుందనుకున్నాను.

కాఫీ-గీఫీ...కాసిని సిగరెట్లూ...అనుకోనిచ్చే తరగతికి డబ్బులు మిగుల్చుకుంటే చాలు.

...త్రోవలో ఆడుతూ-పాడుతూ నేను అక్కడికి చేరుకునేటప్పటికే ఆట మొదలు వేశారు.

అవాళా యింకా, విప్రనారాయణే! అదివరకు దాన్ని కచ్చా - పచ్చాగా అయిదారుసార్లు, సగం- సగం చూశాను. అరవచింతామణేమోకదా అనుకొని పరుగెత్తాను సుమా... తారీఖుతడిసి సిసలుగా కనబడటంలేదు. (అది రేపటినుంచి) - అన్నాడు, కన్నుంఅవతలవాడు.

ఇవతల నేనుతప్ప ఇంకో పిట్ట మిగలలేదు. యింతలో, వాన తగులుకున్నది.

ఆడవాళ్ళ గేటుమీద అర్చితప్ప...ఆ బారు-బారునా, ఎక్కడా ఆచ్ఛాదన లేదు...అక్కడే నక్కాను.

నాపక్కను, ఓ కుర్రవాడు, చిరుగుల బనీనంతా తడిసి ముద్దయి, తలుపు రెక్కనానుకొని యీదురుకు గజ-గజలాడుతున్నాడు.

గేటులో ఉండే రకమేమో అనుకున్నాను. కాదన్నాడు. చేగోడీల బాపతేమో అనుకున్నాను; ఉహూఁ అన్నాడు. అన్నా, వాళ్ళూ అందరూ ముందు లోపలికి వెళ్ళిపోతే, తాను ఒక్కడూ వెనకపడి మిగిలిపోయినా నన్నాడు. ఎల్లా లోపలికిపోవడం? డబ్బులు వాళ్ళదగ్గిర వున్నాయి.. టిక్కెట్టు లేనిదే గేటుదగ్గిర, లోపలికి పోనీయరు. ఎల్లా లోపలికి వెళ్ళడం?...

అవును పాపం, టిక్కెట్టు లేకుండా లోపలికి పోలేదు...

ఆ కాసిని డబ్బులూ పెట్టి టిక్కెట్టుకొని, అది వాడి చేతులో పెట్టి, ఉడాయించమన్నాను. అంత వానలోనూ తడుస్తూ నేను యింటికి వచ్చాను...

చూడు...ఎక్కడి కెక్కడ?...

ఎవరో పసివాడో పెద్దవాడో...పారేసుకున్న కానీ...

ఎందరి కాన్లో దులిపి...నాకు కట్టబెట్టాడు, లాటరీవాడు.

నేను అది మూటకట్టుకుని కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి...హస్తార్పితంగా అందులో కొంత...ఆ పసివాడిపరంగా దరిసించాను. ఎక్కడి కెక్కడ?..."

--'ఆ కుర్రవాడి మాటలన్నీ నిజమని నమ్మావ్?'

'లేదోయ్...అవన్నీ అబద్ధాలని వాడి ముఖమే అంటూంది.'

'అయితే, మరి...'

...వాడు అనుకోని పని మనం చేస్తే...ఆ హాయికి ఖరీదులేదు."

...'వానలో తడవకపోతే, వెలిసేదాకా ఆగితే ఏం ముంచుకుపోయిందో...?'- అంతా విన్నతరువాత యీ సందేహం రాకతప్పదు.

'ఏమో, అప్పు డలా తోచిందికాదు.'

'అవునులే. అంతటి ఘనకార్యం చేసినప్పుడు...ఆమాత్రం ఆవేశం...అపాటి ఒళ్ళు తెలియకపోవడం లేకపోతే, ఎల్లా? ఆ హుషారులో...ఆకాశంమీద నడిచావనుకుంటాను!...ఏం?'

ఉహూఁ... అడుగుతీసి అడుగువేయలేకపోయినాను; అందుకే తడిసి ముప్పందుమైంది!

'ఎందుచేతనో?...'

'ఆఁ... ముక్తసరిగా టిక్కెట్టు మాత్రమే కొని యిచ్చాను కాని...పైనో అర్ధణా అణా కొనుక్కు తినమని యిచ్చేపాటి తెలివీ, తెగువా లేకపోయింది కదా...యీ ఆలోచన పోయేప్పటికల్లా, నామీద నాకే ఎంత అసహ్యం వేసిందనుకున్నావ్!'

'ఔనులే పాపం....నీ ఔదార్యం ఎవరెరుగరు? కాని...నీ జేబు ఆ తరుణంలో పూర్తిగా ఖాళీ అన్నసంగతి...నీకు గుర్తులేకపోయినా...మేము గ్రహించుగోగలము...'

'ఛస్...నీ విషపు ఆలోచనతో కథ కాస్తా చెడిపోయింది...'

'కాదోయ్...ఇది కథే అయితే ఓ కొలిక్కి వచ్చి పకడ్‌గా రక్తికట్టింది...'

(సాగదీసిన కొద్దీ...బిగిసి పీటముడి పడుతుంది... ఇద్దరమూ కథల కామరాజులమే...)

★ ★ ★